

వైసీపీ శ్రేణులకే అత్యధికంగా పంపిణీ
నిబంధనలను పట్టించుకోని అధికారులు
ఒకే ఇంట్లో రూ.2 కోట్ల పంట రుణాలు
ఉద్యోగ నియామకాల్లోనూ చేతివాటం
ఐదేళ్లలో గాడి తప్పిన పాలన

డీసీసీబీలో దా'రుణాలు'!

ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) గాడితప్పింది. పాలకవర్గం, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. రుణాల మంజూరులో వైసీపీ శ్రేణులకే పెద్దపీట వేశారు. కమీషన్లకూ తెరతీశారు. ఉద్యోగ నియామకాల్లోనూ డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. వీటిపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- చిత్తూరు కలెక్టరేట్

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించిన డీసీసీబీలో అవకతవకలు చోటు చేసుకున్నా అడిగే వాళ్లు లేకుండా పోయారు. నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేయడం, తద్వారా కమీషన్లు పొందేవారన్న విమర్శలున్నాయి ఐదేళ్లగా సింగిల్ విండోలకు ఎన్నికలు జరగకపోవడం, నామినేటెడ్ కమిటీల నియామకంతో సెవెన్‌మెన్ పాలకవర్గం పలుచబడింది. నాటి మంత్రి పెద్దిరెడ్డి ఆశీస్సులతో ఐదేళ్లుగా బ్యాంకు ఛైర్‌పర్సన్‌గా రెడ్డమ్మ ఉన్నా.. ఆమె భర్త, వైసీపీ నేత కృష్ణమూర్తి హవానే నడిచింది. మీటింగుల్లో ఆయన కూడా కూర్చోవడం, అధికారులకు ఆదేశాలు జారీ చేసేవారు. అధికారులూ ఆయన ఆదేశాలను పాటించేవారు. ఇక, ఇక్కడి కొందరు డైరెక్టర్లు.. బ్యాంకు అధికారులతో కలిసి రుణాలకు సంబంధించిన ప్రతి ఫైలుకూ 10శాతం వసూలుచేసి మంజూరు చేసేవారన్న విమర్శలున్నాయి. లేకుంటే కుంటి సాకులు చెబుతూ బ్యాంకు చుట్టూ తిప్పించుకునే వారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా కమీషన్ల పేరిటే రూ.లక్షల్లో వసూలు చేశారన్న విమర్శలున్నాయి. ఎక్కువగా పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి, తిరుపతి, పిచ్చాటూరు బ్యాంకు బ్రాంచుల పరిధిలోని రైతులు ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది.

రుణాలన్నీ వైసీపీ శ్రేణులకే..

వి.కోట, మదనపల్లె, పలమనేరు, బైరెడ్డిపల్లె, పుంగనూరు తదితర బ్యాంకు బ్రాంచుల్లో వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు రూ.40 లక్షలకు మించి నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేశారు. వీటిలో 90 శాతం వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలకే సరైన రికార్డులు లేకున్నా ఇచ్చేశారని సమాచారం. ఓ కుటుంబంలో ఒకరికే రుణం ఇవ్వాల్సి ఉంది. వి.కోటలో మాత్రం ఒకే ఇంట్లోని ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.40 లక్షల చొప్పున రూ.రెండు కోట్లు మంజూరు చేయడం గమనార్హం. ఇలా పలు బ్యాంకు శాఖల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మంత్రి పెద్దిరెడ్డి, వైసీపీ నేత కృష్ణమూర్తి ఆదేశాలతో ఇదంతా జరిగినట్లు బ్యాంకు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అప్పటి మంత్రుల అండదండలతో పాలకవర్గ సభ్యులు వారి బంధువుల పేర్లతో రికార్డులు లేకుండా రూ.10 కోట్ల మేర రుణాలు తీసుకున్నారు. ఒక్క పైసా కూడా ఎవరూ చెల్లించలేదు.

ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు

డీసీసీబీ విస్తరణలో భాగంగా 2022లో నియామకాల్లో జరిగిన అక్రమాలపై బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఉద్యోగ నియామకాల్లో సొసైటీ ఉద్యోగులకు 25 శాతం కేటాయించాలి. ఆ మేరకు మంజూరైన 50 పోస్టుల్లో 12 ఉద్యోగాలు సొసైటీ ఉద్యోగులకు కల్పించారు. ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల మేర వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఈ మొత్తాన్ని అధికారులు, పాలకవర్గం 50.. 25.. 25.. శాతాల చొప్పున పంచుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఉద్యోగ అవకాశాలు ఇస్తామని మరి కొందరు సొసైటీ ఉద్యోగుల నుంచీ కొంత మొత్తాన్ని వసూలు చేసి ఉద్యోగాలు ఇవ్వలేదు. దీంతో బాధితులు పాలకవర్గం, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పైసా కూడా తిరిగివ్వలేదు. ఏవో కారణాలతో టెర్మినేట్, సస్పెండ్ చేసిన ఉద్యోగుల నుంచీ భారీ మొత్తాల్లో తీసుకుని తిరిగి ఉద్యోగాలు ఇచ్చినట్లు సమాచారం.

అటెండర్, వాచ్‌మెన్ నియామకాల్లో గోల్‌మాల్

బ్యాంకు పరిధిలో 40 బ్రాంచులు ఉండగా, వాటిలో 150 మంది అటెండర్లు, వాచ్‌మెన్ పని చేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ కింద హైదరాబాద్‌కు చెందిన గాయత్రి సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా వీరిని తీసుకున్నారు. గతంలో 10 మందిని అటెండర్లు, వాచ్‌మెన్‌గా తీసుకోగా, వారిలో 8 మంది మాత్రమే పనిచేస్తున్నారు. జీతాలు మాత్రం పది మందికీ మంజూరు చేస్తున్నట్లు తెలిసింది. ఆ ఇద్దరి జీతాలు కొందరి జేబుల్లోకి వెళ్తున్నట్లు తెలిసింది. ఇలా ఏజెన్సీ ద్వారా జరిగిన నియామకాలు.. ఇప్పుడు పనిచేస్తున్న వారు.. చెల్లిస్తున్న జీతాలపై సమగ్ర విచారణ చేపడితే అసలు అక్రమాలు బయటపడతాయి.

ఓటీఎస్, అమూల్ రుణాల పేరిట అక్రమార్జన

వాయిదా మీరిన అన్నిరకాల రుణాలు మాఫీ చేస్తామని, ఓటీఎస్ పథకం పేరిట మేలు చేస్తామని కొందరు డైరెక్టర్లు, రైతుల నుంచి కమీషన్లు వసూలు చేసినట్లు తెలిసింది. కొన్ని బ్యాంకు శాఖల ద్వారా వైసీపీ శ్రేణులు దొంగ పేర్లతో పాడి పశువులు కొన్నట్లు చూపి.. అమూల్ రుణాలు పొందారు. పెద్దిరెడ్డి ఆదేశాలతో డీసీసీబీ నుంచే వీరికి రూ.20 కోట్ల రుణాలిచ్చినట్లు తెలిసింది. వీటిపైనా సమగ్ర విచారణ జరిపిస్తే నిధులు స్వాహా ఏ మేరకు జరిగాయో బయటపడుతుంది.

రెండోసారీ ఆయనే సీఈవో

సాధారణంగా ప్రతి మూడేళ్లకు బ్యాంకు సీఈవోను మార్చాలి. అలా కాకుండా పాలకవర్గం తమకు అనుకూలంగా ఉన్నారనే ఉద్దేశంతో మనోహర్‌గౌడ్‌ను సీఈవోగా రెండోసారి కూడా కొనసాగించారు. 'పెద్దిరెడ్డి చెప్పారు..' అంటూ డీసీసీబీలో ఎవరికి వారు అక్రమాలకు తెర తీశారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి.. ఐదేళ్లుగా డీసీసీబీలో జరిగిన తంతుపై విచారణ జరిపించాలని రైతులు డిమాండు చేస్తున్నారు.

జిల్లా సమగ్రశిక్షలో అంతర్గత ఆడిట్

వైసీపీ హయాంలో చెల్లింపులపై ఆరా



జిల్లా సమగ్రశిక్ష కార్యాలయం

చిత్తూరు (సెంట్రల్), జూలై 10: జిల్లా సమగ్రశిక్షలో రాష్ట్ర స్థాయి ఆడిట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. సమగ్రశిక్ష స్టేట్ ఫైనాన్స్ కంట్రోలర్ పాలేశ్వర్‌రావు, స్టేట్ అకౌంట్స్ అధికారి ప్రసాదరావు నేతృత్వంలోని బృందం బుధవారం జిల్లా సమగ్రశిక్ష కార్యాలయానికి చేరుకుని ఆడిట్ చేపట్టారు. ఆర్థిక లావాదేవీలపై ఏపీసీ వెంకటరమణారెడ్డి, అకౌంట్స్ అధికారి నాగరాజరావు లను విచారించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నియమకాలు, అనుమతులపై లోతుగా విచారణ జరిపారు. సహిత విద్య, కేజీబీవీ, మానిటరింగ్, ట్రైనింగ్, ప్లానింగ్, నాడు-నేడు, ఇంజనీరింగ్ తదితర విభాగాల రికార్డులను పరిశీలించారు. కేజీబీవీ, సహిత విద్య నియామకాల్లో అనుసరించిన పద్ధతులను పరిశీలించారు.

సెక్టోరియల్స్ పోస్టులకు పోటాపోటీ

జిల్లా సమగ్రశిక్షలో సెక్టోరియల్ పోస్టులకు పోటీ పెరిగింది. కొత్త ప్రభుత్వం రావడంతో వైసీపీ హయాంలో పనిచేసిన సెక్టోరియల్స్ వైదొలిగారు. సహిత విద్య కోఆర్డినేటర్ (ఐఈ) ప్రభాకర్ వర్మ హెచ్ఎం కావడంతో ఆర్జేడీ నుంచి పోస్టింగ్ రావాల్సి ఉంది. అసిస్టెంట్ ఏఎంవో పల్లవి దామలచెరువు జెడ్పీ హెచ్ఎస్‌కు వెళ్లారు. ఆల్టర్‌నేటివ్ స్కూల్స్ మానిటరింగ్ (ఏఎల్ఎస్‌వో) అజయ్‌కుమార్‌కు ఇప్పటి వ ర కు స్థానం కేటాయించలేదు. అసిస్టెంట్ సీఎంవోకు వి.జయ ప్రకాష్‌నాయుడిని ఇన్‌చార్జిగా నియమించారు. మిగిలిన రెండు స్థానాలకు ఆరు దరఖాస్తులు వచ్చాయి. పూతలపట్టు బండపల్లి జెడ్పీహెచ్ నుంచి శశిధర్, పెనుమూరు జెడ్పీహెచ్ఎస్ నుంచి వి.సుధాకర్, రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల జెడ్పీ హెచ్ఎస్ నుంచి రమేష్‌బాబు, బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఎస్.నరసింహులు, రామకుప్పం జెడ్పీహెచ్ఎస్ (బాయ్స్) నుంచి ఇ.ఇంద్రాణి, రామకుప్పం మండలం లింగాపురం జెడ్పీహెచ్ఎస్ నుంచి సి.మోహన్ సింగ్‌లు దరఖాస్తు చేసుకున్నారు. గురువారం మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తు న్నారు. నియామక ప్రక్రియపై ఏపీసీ వెంకటరమణను వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాలతో నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

టీడీపీలోకి కుప్పం మున్సిపల్ ఛైర్మన్?

9 మంది కౌన్సిలర్లతో అమరావతికి పయనం

కుప్పం, జూలై 10: కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, 9 మంది కౌన్సిలర్లతో అమరావతికి పయనమై వెళ్లినట్లు తెలిసింది. వైసీపీకి చెందిన ఛైర్మన్, టీడీపీలో చేరేందుకే బయలుదేరి వెళ్లినట్లు కుప్పంలో విస్తృతంగా ప్రచారమవుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... మూడేళ్ల క్రితం జరిగిన కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. అప్పట్లో మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కనుసన్నల్లో అధికార యంత్రాంగం వ్యవహరించింది. మొత్తం 25 వార్డుల్లో 19 వార్డుల్లో వైసీపీ విజయం సాధించింది. టీడీపీ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. మున్సిపల్ ఛైర్మన్‌గా డాక్టర్ సుధీర్ ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం తర్వాత ఛైర్మన్ సహా మెజారిటీ వెసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరికకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే వైసీపీనుంచి ఎవరినీ తీసుకోవద్దన్న పాలసీ మేరకు వారి ప్రయత్నాలు సాగలేదు. కానీ వారు ప్రయత్నం చేయడం మాత్రం మానలేదు. మరోవైపు చిత్తూరు కార్పొరేషన్‌లో మేయరు, పలువురు కార్పొరేటర్లు టీడీపీ, జనసేనలో చేరడంతో కౌన్సిల్ కూటమి వశమైంది. ఇక, పుంగనూరులో మున్సిపల్ ఛైర్మన్ సహా 11 మంది కౌన్సిలర్లు వైసీపీకి రాజీనామా చేశారు. త్వరలో టీడీపీలో చేరనున్నారు. ఈ నేపథ్యంలో కుప్పం మున్సిపాలిటీలోనూ చేరికలకు మార్గం ఏర్పడిందని చెబుతున్నారు. ప్రయత్నాలు తుది దశకు చేరినందువల్లే మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ మరో 9 మంది కౌన్సిలర్లతో అమరావతి వెళ్లినట్లు తెలిసింది. అయితే స్థానిక టీడీపీ నేతలు ఎవరికీ వీరి చేరికకు సంబంధించిన సమాచారం లేదు. అన్నమయ్య జిల్లాకు చెందిన మంత్రి ద్వారా మున్సిపల్ ఛైర్మన్ సుధీర్ ముమ్మర ప్రయత్నాలు చేయడంవల్లే ఒకింత సానుకూల వ్యక్తమయినట్లు తెలిసింది. నేడో రేపో చేరికలు జరిగిపోవడం ఖాయమన్న ప్రచారం కుప్పంలో జోరుగా సాగుతోంది. ఈ విషయం టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంచర్ల శ్రీకాంత్‌కు తెలిసే జరిగిందా లేదా ఆయన పరోక్షంలో జరిగిందా అన్న విషయంలో సందిగ్ధత నెలకొంది. ఆయనకు తెలిసే జరిగిందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఎమ్మెల్సీకి తెలియకుండా చేరికలు జరిగే అవకాశం ప్రస్తుతం నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితుల్లో కనిపించడం లేదు. దీనిపై ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. మరోవైపు మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్‌కు ఫోన్ చేయడానికి ప్రయత్నించగా ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది.

గ్రానైట్ లారీ వస్తే ఒప్పుకోం

- నరిగిపల్లిలో అడ్డుకున్న గ్రామస్తులు





గ్రామంలో అడ్డుకోవడంతో ఆగిపోయిన గ్రానైట్ లారీ.. గొడవ పడుతున్న గ్రామస్తులు

చిత్తూరు రూరల్, జూలై 10: ఇక నుంచి మా గ్రామంలోకి గ్రానైట్ లారీలు వస్తే ఊరుకొనేది లేదు.. అంటూ చిత్తూరు రూరల్ మండలం నరిగిపల్లి గ్రామస్తులు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం రాత్రి వీరు గ్రామంలో గ్రానైట్ బండను తీసుకెళ్తున్న లారీని అడ్డుకున్నారు. సమయం సందర్భం లేకుండా గ్రానైట్ లారీలు తిరుగుతూ ప్రమాదాలు తీసుకొస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. లారీల శబ్దంతో రాత్రిళ్ల నిద్రలేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రేపటి నుంచి లారీ తమ గ్రామంలోకి ప్రవేశిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. లారీని అడ్డుకోవడంతో కాసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది.

విద్యార్థులతో నేనే ఫోనులో మాట్లాడతా: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 10: పాఠశాలల్లోని మౌలిక సదుపాయాల కల్పన, కొరత, విద్యాబోధన, హాజరు తదితర అంశాలపై తానే విద్యార్థులకు ఫోన్‌చేసి మాట్లాడి తెలుసుకుంటానని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో ఆయన విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. తరచూ పాఠశాలలు తనిఖీ చేయాలని, స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. అదే సమయంలో విద్యార్థుల ఫోను నెంబర్లను సేకరించాలని సూచించారు. నిల్వవున్న స్టూడెంట్ కిట్లు, పాఠ్యపుస్తకాలను వెంటనే విద్యార్థులకు అందించాలన్నారు. షూస్‌లో సమస్యలుంటే రీప్లేస్మెంట్ చేయాలన్నారు. బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్చేలా వారి తల్లిదండ్రులను ఒప్పించాలని సూచించారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల పెంపుపై ఎంఈవోలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, రోజూ ఒక స్కూల్‌ను తనిఖీ చేయాలని ఆదేశించారు. డీఈవో దేవరాజులు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, ఎంఈవోలు పాల్గొన్నారు.



డీజిల్ ఒంటిపై పోసుకుంటున్న మహిళా రైతు

సీజేఎఫ్ఎస్ భూముల్లో రగడ

మహిళా రైతు ఆత్మహత్యాయత్నం

ఎమ్మెల్యే జోక్యంతో వెనుతిరిగిన యంత్రాంగం

వెదురుకుప్పం, జూలై 10: వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లె సమీపంలోని సీజేఎఫ్ఎస్ భూముల్లో బుధవారం గొడవ చోటుచేసుకుంది. ఓ మహిళా రైతు ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా, అధికారులు వారించారు. బాధితులు తెలిపిన ప్రకారం... ఈ సీజేఎఫ్ఎస్ భూముల్లో దేవరగుడిపల్లెకు చెందిన కొందరు సాగు చేసుకుంటున్నారు. ఎస్ఆర్‌పురం మండలం బోడిదేవరగుడిపల్లెకు చెందిన ఒకరు తనకు ఆ భూమికి సంబంధించిన పట్టాలు ఉన్నాయని వీరిని బెదిరించేవారు. ఈ నేపథ్యంలో బుధవారం వెదురుకుప్పం తహసీల్దార్ జయంత్‌కుమార్ సహా రెవెన్యూ ఉద్యోగులతో ఆ సీజేఎఫ్ఎస్ భూముల్లోకి వచ్చి సర్వే చేస్తామని పనులు మొదలు పెట్టడంతో గొడవ మొదలైంది. తమ అనుభవంలో ఉన్న భూములు తమకు దక్కకపోతే ఆత్మహత్య చేసుకుంటామంటూ ఓ మహిళా రైతు డీజిల్‌ను పోసుకున్నారు. మరో మహిళ కూడా చేతిలో ఉన్న డీజిల్ సీసా చూపి తానూ ఒంటిపై పోసుకుని కాల్చుకుంటానంటూ అధికారులకు స్పష్టంచేశారు. ఏళ్ల తరబడి ఈ భూములు తమ అనుభవంలో ఉన్నాయని వారు తెలిపారు. కాగా, ఒంటిపై డిజిల్ పోసుకున్న.. పోసుకుంటామన్న వారిని తహసీల్దారు వారించారు. కాగా, రెవెన్యూ యంత్రాంగం సర్వేకు రావడంపై ఎమ్మెల్యే థామస్‌కు బాధితులు ఫోనుచేసి చెప్పారు. దీంతో ఆయన ఫోనులో అధికారులతో మాట్లాడటంతో వారు వెనుతిరిగారని బాధితులు తెలిపారు.

విద్యార్థులతో ప్రయోగాలు చేయించండి

చిత్తూరు (సెంట్రల్), జూలై 10: ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబుల్లో విద్యార్థులచే ప్రయోగాలు చేయించాలని జిల్లా సైన్స్ అధికారి రమణ సూచించారు. చిత్తూరులో బుధవారం జిల్లాలోని ఫిజిక్స్, సైన్స్ టీచర్లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అటల్ టింకరింగ్ ల్యాబ్ వినియోగంపై రమణ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రతి విద్యార్థిచే ఏదో ఒక రకమైన కొత్త ప్రయోగాలు చేయడం ద్వారా వారిలోని తెలివి తేటలకు పదును పెట్టినట్లు అవుతుందన్నారు. డీఈవో నాగరాజు, డీవైఈవో చంద్రశేఖర్ మాట్లాడారు.

నేటి నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా

కందిపప్పు, బియ్యం విక్రయాలు



హోల్‌సేల్ డీలర్లతో సమావేశమైన జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 10: జిల్లాలోని రైతు బజార్లతో పాటు ఎంపిక చేసిన ప్రాంతాల్లో కందిపప్పు, బియ్యం తక్కువ ధరకే గురువారం నుంచి విక్రయించనున్నారు. ఈ మేరకు జేసీ శ్రీనివాసులు బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అధికారులు, ధాన్యాలు, బియ్యం, నూనె,కందిపప్పు హోల్‌సేల్ డీలర్లతో సమావేశమయ్యారు. కందిపప్పు కిలో రూ.160, బీపీటీ సోనామసూరి కిలో రూ.48, రూ.49కి అందిస్తున్నామన్నారు. బహిరంగ మార్కెట్‌లో, హోల్‌సేల్ మార్కెట్‌లో కూడా ఇదే ధరకు విక్రయించాలని జేసీ ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిత్తూరు రైతు బజార్‌లో బియ్యం, కందిపప్పు, కల్లూరు ఎఫ్ఎంఎస్ ట్రేడర్స్‌లో కందిపప్పు, పుంగనూరు ప్రభు ఇండస్ట్రీస్, ప్రభు ట్రేడర్స్‌లో కందిపప్పు, నగరి రైస్ మర్చంట్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో బియ్యం, కందిపప్పు, చిత్తూరులోని బాలాజి ట్రేడర్స్, గుప్తా హోల్‌సేల్ డీలర్, క్రిష్ణమూర్తి అండ్‌సన్స్ దుకాణాల్లో బియ్యం అమ్మకాలు తక్కువ ధరలకే వినియోగదారులకు అందిస్తారని పేర్కొన్నారు. ఎక్కడైనా అధిక ధరలకు విక్రయాలు చేసే 80083 01423 నెంబరుకు ఫోనుచేసి డీఎస్వోకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయ్స్ డీఎం మోహన్‌బాబు, డీఎస్వో శంకరన్, మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్, హోల్‌సేల్, రీటైల్ డీలర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎంతో హేమాంబరధరరావు భేటీ



చంద్రగిరి, జూలై 10: చంద్రగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలూ పని చేశానని, నామినేటెడ్ పదవుల కేటాయింపులో తనకు తగిన గుర్తింపు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు విన్నవించారు. బుధవారం విజయవాడలో చంద్రబాబును హేమాంబరధరరావు కలిశారు.ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ కోసం తన కృషిని వివరించారు.దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారని హేమాంబరధరరావు తెలిపారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు నాలుగు ఫిర్యాదులు



చిత్తూరు రూరల్, జూలై 10: గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో బుధవారం నిర్వహిం చిన విద్యుత్ శాఖ గ్రీవెన్స్ డేకు నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 3 అప్పటికప్పుడే పరిష్కరించారు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర మాట్లాడుతూ ప్రతి బుధవారమూ నిర్వహించే గ్రీవెన్స్‌డేపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. చాలా మందికి గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలియడం లేదని, ఏఈలు, లైన్‌మెన్లు, శాఖ సిబ్బంది విరివిగా ప్రచారం చేయాలన్నారు. అన్ని రకాల విద్యుత్ సమస్యలపై వినియోగదారులు, రైతులు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. వాటిలో 90 శాతం అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. డీఈలు పాల్గొన్నారు.

అదుపుతప్పి రోడ్డు పక్కకు దిగబడిన పాఠశాల బస్సు

● విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం



నక్కనపల్లె వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కకు దిగబడిన పాఠశాల బస్సు

వి.కోట, జూలై 10: వి.కోట మండలం కె.నక్కనపల్లె వద్ద ఓ ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దిగబడింది. విద్యార్థులందరూ క్షేమంగా బయట పడటంతో పిల్లల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం సాయంత్రం విద్యార్థులతో వి.కోట నుంచి బయలుదేరిన బస్సు పత్రపల్లె మీదుగా జవ్వునిపల్లెకు వెళుతోంది. కె.నక్కనపల్లె సమీపంలో ముందు వెళుతున్న మరో పాఠశాల బస్సును అధిగమించే క్రమంలో ఎదురుగా ఆటో రావడం గమనించిన డ్రైవర్ బస్సును తిరిగి ఎడమవైపు తిప్పారు. ఈ క్రమంలో ముందున్న బస్సుకు వెనక కుడివైపు బస్సు ఢీకొని రోడ్డు పక్కన ఒరిగింది. బస్సును ఒక్కసారిగా అటు, ఇటు మళ్ళించడంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. రోడ్డు పక్కనున్న పెద్దరాయికి వెనుక టైర్లు అడ్డురావడంతో బస్సు పక్కనున్న పొలాల్లోకి బోల్తాపడకుండా ఆగింది. లేకుంటే బస్సు బోల్తాపడి విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలిగేది. ఈ సమయంలో బస్సులో ముప్పై మందికిపైగా చిన్నారులు ఉన్నట్లు సమాచారం. ప్రమాద విషయం తెలుసుకున్న పిల్లల తల్లిదండ్రులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని పిల్లలను బస్సులోంచి దించి ద్విచక్ర వాహనాల ద్వారా వారి ఇళ్ళకు చేర్చారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని అతనిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎద్దుపొడిచి రైతు మృతి



జయచంద్ర (ఫైల్ ఫొటో)

బైరెడ్డిపల్లె, జూలై 10 : ప్రమాదవశాత్తు ఎద్దుపొడిచి ఓ రైతు మృతిచెందిన ఘటన బుధవారం బైరెడ్డిపల్లెలో జరిగింది. బైరెడ్డిపల్లె మహమ్మదీయవీధిలో నివాసం వుంటున్న జయచంద్ర(37) తమ ఎద్దును గ్రామసమీపంలో పొలాల వద్దకు మేతకు తీసుకెళ్లారు. ఆ సమయంలో ఎద్దు పొడవడంతో జయచంద్ర స్పృహ కోల్పోయారు. గమనించిన స్థానికులు అతడిని వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు

తిరుపతి(సెంట్రల్)జూలై10: తిరుపతి,రేణిగుంట స్టేషన్ల మీదుగా బుధవారం పలు రైళ్ళు ఆలస్యంగా నడుస్తున్నాయి. కేరళ ఎక్స్‌ప్రెస్ (12626-12625) రెండు గంటలకు పైగా ఆలస్యంగా నడుస్తోంది. కన్యాకుమారి నుంచి ముంబాయికి వెళ్లే జయంతి ఎక్స్‌ప్రెస్(16382) రెండున్నర గంటలు, ముంబాయి- చెన్నై ఎక్స్‌ప్రెస్(22159)లు గంటన్నర ఆలస్యంగా నడుస్తున్నాయి. హౌరా- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (22887) ఐదున్నర గంటలు, సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్(12770)గంటన్నర పాటు ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు తాగునీటికి,అల్పాహారాలకోసం ఇబ్బంది పడ్డారు.

తిరుపతి-హిస్సార్ ప్రత్యేక రైలు వేళల్లో మార్పు

తిరుపతి-హిస్సార్ (రాజస్తాన్) మధ్య నడుస్తున్న వారాంతరపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు(04717-18) వేళల్లో మార్పులు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇక నుంచి హిస్సార్ నుంచి రైలు బయలుదేరి సోమవారం ఉదయం 9.55 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. తిరిగి అదేరోజు రాత్రి 11.45 గంటలకు తిరుపతిలో బయలుదేరనుంది. జైపూర్ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారుల కోరారు.

'కడా'కు సర్వాధికారాలు

● పుష్కలంగా ఆర్థిక వనరులు
● డివిజనల్ స్థాయి అధికారులపై అజమాయిషీ



కుప్పం, జూలై 10: కడా (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)కు సర్వాధికారాలు దఖలు పడ్డాయి. కుప్పం ప్రాంత అభివృద్ధి ఏకైక లక్ష్యంగా నడిచే ఈ సంస్థ పరిధిలోకే డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ విభాగాలను చేర్చడమే కాకుండా ఆయా గెజిటెడ్ అధికారులను, డివిజనల్ స్థాయి అధికారులను నేరుగా కడా పీడీకి బాధ్యులను చేస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి జీవో నెంబర్ 58 విడుదల చేసింది. ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నెల్లూరు జిల్లా మున్సిపల్ కమిషనర్, ఐఏఎస్ అధికారి అయిన వికాస్ మర్మత్ నియమితులైన విషయం తెలిసిందే. అదేరోజు కడాను ఏర్పాటు చేస్తూ, విధులు బాధ్యతలు కూడా నిర్వచిస్తూ జీవో 58ను ప్రభుత్వం విడుదల చేసింది. కీలకమైన అధికారాలు దాఖలు పడిన కడాకు ప్రత్యేకంగా ఆర్థిక శాఖనుంచి ప్రతి ఏటా నిధులు విడుదల చేయాలని కూడా ఆ జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. అంతేకాక ప్రత్యేక ఉద్యోగులను సైతం కేటాయించారు. గతంలో కడా ఉన్నదే కానీ, దానికి ఎటువంటి పరిపాలనాపరమైన, ఆర్థికపరమైన అధికారాలు దాఖలు పడలేదని ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఆ లోటును భర్తీ చేస్తూ సకలాధికారాలతో కూడిన నూతన కడాను తీసుకొస్తూ జీవోను విడుదల చేసింది. ఎటువవంటి అధికారాలు లేని కడా ఎస్.ఓ. (స్పెషల్ ఆఫీసర్) పోస్ట్ పేరును పి.డి. (ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా) మార్చింది. గతంకంటే భిన్నంగా ఏర్పాటైన కడా విధులు, బాధ్యతలు ఇవీ.

- కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలతోపాటు కుప్పం మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధి కోసం కడా ఏర్పాటైంది.
- అన్ని ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం మెరుగు కావడానికి సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ సిస్టం ఏర్పాటు చేయడానికి కడా నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించారు.
- పూర్వం స్పెషల్ ఆఫీసర్‌గా పిలిచిన వారు, ఇప్పుడు ప్రాజెక్టు డైరెక్టర్‌గా పేరు మార్చారు.
- కడా ప్రాంతంలోని అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా చేయడానికి కడా పీడీ నేరుగా బాధ్యత వహిస్తారు. కడా పరిధిలోని అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు అంటే ప్రభుత్వ శాఖల అధికారుల సకల విధులు, బాధ్యతలను పీడీ సమీక్షించి పర్యవేక్షిస్తారు. ఆయా కార్యక్రమాల ద్వారా స్థూల ఆర్థిక వృద్ధిని సాధించడానికి అనువైన కార్యక్రమాలు, ప్రాజెక్టులు, పథకాలను రూపొందించి అమలు చేస్తారు. స్థిరమైన ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలను విధించుకుని, దానికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా కడా వ్యవహరిస్తుంది. పీ-4 విధానం (అంటే పబ్లిక్, ప్రైవేట్, వ్యక్తులు, భాగస్వామ్యం) అనుసరించడం ద్వారా పేదరికంలేని సమాజ నిర్మాణంకోసం కృషి చేస్తుంది.
- సబ్ కలెక్టర్‌గా పనిచేసిన సీనియర్ టైమ్ స్కేల్ లోని ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారిని కడా పీడీగా నియమిస్తారు.
- జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉంటారు. పీడీ నేరుగా కలెక్టర్‌కు నివేదించాలి.
- ప్రణాళిక, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్ అండ్ బి, నీటి వనరుల అభివృద్ధి, విద్యుత్తు, డీఆర్డీయే పాఠశాల, ఉన్నత విద్యాశాఖలు, ఆరోగ్యం, వ్యవసాయం, సంక్షేమం, పౌర సరఫరాలు, హౌసింగ్, వంటి 17 ప్రభుత్వ లైన్ డిపార్టుమెంట్లు కడా పరిధిలోకి వస్తాయి. కడా ప్రాంతానికి అవసరమైన అధికారాలు, బాధ్యతలు కలిగిన డివిజనల్ స్థాయి అధికారులను ఆయా డిపార్టుమెంట్లు కడా పరిధిలో నియమించాలి.
- కుప్పం రెవెన్యూ డివిజనల్ అధికారితో సహా, కడా ప్రాంతంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అందరూ కడా పీడీ పరిపాలనా నియంత్రణలోనే ఉంటారు.
- కడా పీడీ తన కుప్పం ప్రాంత అభివృద్ధిని లక్ష్యం చేసుకుని నిర్వహించే సమీక్షలకు, ఆ పరిధిలో పనిచేస్తున్న సంబంధిత అధికారులు, సిబ్బందితో సహా తప్పనసరిగా హాజరు కావాలి.
- రెవెన్యూ డివిజన్‌తో అనుబంధంగా లేని పరిశ్రమలు, ఐటీ, ఎండోమెంట్స్ వంటి ప్రభుత్వ విభాగాలు ఆయా విభాగాలలోని సీనియర్ అధికారిని కడా పీడీ నిర్వహించే సమీక్షలకు విధిగా పంపాలి.
- ఆర్డీవోతో సహా కడా ప్రాంతంలో పనిచేస్తున్న అన్ని గెజిటెడ్ అధికారుల సాధారణ సెలవులు, టీఏ బిల్లులను కడా పీడీ ఆమోదిస్తారు.
- ఏదైనా రికార్డులను అడగడానికి, కడా పరిధిలని ఏదైనా నియంత్రణ, అభివృద్ధి పనులను తనిఖీ చేయడానికి లేదా సమీక్షించడానికి పీడీ అధికారం కలిగి ఉంటారు.
- కడా ప్రాంతంలో పనిచేస్తున్న గెజిటెడ్ అధికారులపై వచ్చే ఆరోపణల విషయంలో విచారణాధికారాన్ని కడా పీడీ అధికారం కలిగి ఉంటారు.
- అన్ని డివిజనల్ స్థాయి అధికారుల పనితీరుపై వార్షిక రహస్య నివేదికలను కడా పీడీ కలెక్టర్‌కు నివేదిస్తారు. అలాగే మండల స్థాయి అధికారుల వార్షిక రహస్య నివేదికపై సంతకం చేసే అధికారం కలిగి ఉంటారు.
- మున్సిపాలిటీ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ ఆయా పథకాలు, పనులు పర్యవేక్షించడానికి కడా పీడీ నిర్వహించే సమీక్షా సమావవేశాలకు హాజరు కావాలి.
- కడా కార్యాలయానికి వివిధ కేడర్లకు చెందిన 19 మంది సిబ్బందిని కేటాయించారు. కడా పీడీతో పాటు డిప్యూటీ కలెక్టర్ కేడర్ కుచెందిన అడిషనల్ పీడీ ఒకరు, తహశీల్దారు ఒకరు, డిప్యూటీ తహశీల్దారు ఒకరు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పీఎంయూ బృందం ఇద్దరేసి, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నలుగురు కార్యాలయ ఉప సిబ్బంది, ఇద్దరు వాచ్‌మెన్‌లు, ఇద్దరు డ్రైవర్లను కేటాయించారు.
- కడాకోసం ఆర్థిక శాఖ వార్షిక బడ్జెట్‌ను మంజూరు చేస్తుంది.

జిల్లా ప్రతిష్ఠ పెరిగేలా పనిచేద్దాం

అధికారులకు ఎంపీ దగ్గుమళ్ల పిలుపు



కలెక్టర్, జిల్లా అధికారులతో కలిసి సమీక్షిస్తున్న చిత్తూరు ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 10: జిల్లా ప్రతిష్ఠ పెరిగేలా అందరం కలసికట్టుగా పనిచేసి.. అభివృద్ధి చేద్దామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో కలెక్టర్‌తో కలిసి జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఎంపీ ల్యాడ్స్ ద్వారా మంజూరయ్యే అన్ని పనులను నాణ్యతతో పూర్తిచేయాలని, ఇందుకు సంబంధించిన విధివిధానాలను అన్నిశాఖలు పాటించాలని చెప్పారు. ప్రభుత్వం ద్వారా ఖర్చుచేసే ప్రతి పైసా క్షేత్రస్థాయిలోని పేదలందరికీ చేరేలా పాలన అందిద్దామన్నారు. కేంద్ర నిధులతో అమలవుతున్న ఉపాధి హామీపథకం, జలజీవన్ మిషన్, నేషనల్ హెల్త్ మిషన్, అమృత్‌సరోవర్‌తో పాటు వివిధ శాఖల ద్వారా చిత్తూరు లోక్‌సభ పరిధిలో చేపడుతున్న పథకాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎంపీకి కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ ఎన్.రాజశేఖర్, జడ్పీ సీఈవో ఎన్.గ్లోరియా, హౌసింగ్, డీఆర్డీఏ, మెప్మా పీడీలు పద్మనాభం, తులసి, రాధమ్మ, డీపీవో లక్ష్మి, టిడ్కో ఈఈ వెంకటముని, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన అర్జీలు పరిశీలించండి

ముఖ్యమంత్రి చంద్రబాబు గతనెలలో జరిపిన కుప్పం పర్యటనలో భాగంగా అందిన అర్జీలను పరిశీలించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వివిధ శాఖల అధికారులతో అర్జీల పరిష్కారంపై తీసుకుంటున్న చర్యల గురించి జేసీ శ్రీనివాసులుతో కలసి సమీక్షించారు. అందిన అర్జీల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులు స్పందించి సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. సర్వీసు, ఆర్థిక సంబంధిత అర్జీలను ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ఈనెల 20న తదుపరి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దస్త్రాలు లేకుండానే విచారణ పూర్తి!

● ఆడిట్ అధికారుల తీరుపై ఫిర్యాదుదారుల ఆగ్రహం

చిత్తూరు రూరల్, జూలై 10: జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డిపై విచారణకు సంబంధించి మరిన్ని దస్త్రాలు లేకుండానే ఆడిట్ అధికారులు విచారణ పూర్తి చేసినట్లు తెలిసింది. ఈ మేరకు నివేదిక కూడా సమర్పించినట్లు సమాచారం. దీనిపై ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో జడ్పీ సీఈవో (ఎఫ్ఏసీ)గా ప్రభాకర్‌రెడ్డి అనేక అక్రమాలకు పాల్పడ్డారంటూ విశ్రాంత అధికారి కనకరాజులు నాయుడు, ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి కలెక్టరు షన్మోహన్ ఆదేశాలతో గత నెల నుంచి జిల్లా ఆడిట్ అధికారులు విచారణ ప్రారంభించారు. ఆడిట్ అధికారులు అడిగిన దస్త్రాలను జడ్పీ అధికారులు అందిస్తూ వచ్చారు. విచారణకు కావాల్సిన మరికొన్ని దస్త్రాలు సమర్పించకనే ఆడిట్ అధికారులు విచారణ పూర్తి చేసి నివేదికను కలెక్టర్‌కు అందించినట్లు సమాచారం. పూర్తి దస్త్రాలు లేకుండానే విచారణ పూర్తి చేయడంపై పలువురి నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జరిగిన ఆడిట్‌లోనూ జడ్పీలో ఎటువంటి అక్రమాలు చోటు చేసులేదని అధికారులు క్లీన్ చిట్ ఇస్తూ వచ్చారు. అయితే జడ్పీలో ప్రభాకర్‌రెడ్డి సీఈవో ఉన్న సమయంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని విశ్రాంత అధికారి, ఉద్యోగులు ఫిర్యాదులు చేశారు. అయినప్పటికి అప్పటి మంత్రి పెద్దిరెడ్డి అండతో విచారణ చేసేందుకు అధికారులు ముందుకు రాలేదు. దీంతో వారు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై లోకాయుక్త కమిషనర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. గత రెండు నెలలుగా విచారణ మందకొడిగా సాగుతూనే ఉంది. రెండు రోజులు విచారించి.. నాలుగు రోజులు పట్టించుకునే వాళ్లు కాదు. కానీ, ఇప్పుడు విచారణ పూర్తయిందని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లు సమాచారం.

ఏసీబీ వలలో విలేజ్ సర్వేయర్



సర్వేయర్ గణేష్

సత్యవేడు, జూలై 10 : పొలం హద్దుల గుర్తింపు కోసం రైతు నుంచి లంచం తీసుకుంటున్న ఓ సర్వేయర్‌ను బుధవారం ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి కథనం మేరకు... తిరుపతి జిల్లా సత్యవేడు మండలం కన్నవరం గ్రామానికి చెందిన వేమల భాస్కర్ తన పిత్రార్జితమైన భూమికి సంబంధించి ఎఫ్-లైన్ సర్వే రిపోర్టు(హద్దుల గుర్తింపు) కోసం సంబంధిత సచివాలయంలో ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. సర్వేకోసం ట్రెజరీలో చలానా చెల్లించి సర్వేయర్ గణేష్‌ను కలిశాడు. సర్వే చేయాలంటే రూ.ఆరువేలు తనకు ఇవ్వాలని సర్వేయర్ గణేష్ డిమాండ్ చేశాడు.దీంతో భాస్కర్ ముందస్తుగా రూ. రెండు వేలను తన బావమరిది ఫోన్ నుంచి ఫోన్‌పే చేశాడు.మరోవైపు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు పథకం ప్రకారం సర్వేయర్ గణేష్ రైతు భాస్కర్ నుంచి రూ.4వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గణేష్‌ను ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు.ఎస్ఐలు ఈశ్వర్, సునీల్, శివనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్వీయూ రిటైర్డు ప్రొఫెసర్ కన్నుమూత



జయసింహులు (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10: ఎస్వీయూనివర్సిటీ ఎకనమిక్స్ విభాగ రిటైర్డు ప్రొఫెసర్ వల్లేరు జయసింహులు నాయుడు (76) మృతి చెందారు. నెల రోజులుగా ఊపిరితిత్తుల సంబంధ జబ్బుతో బాధపడుతూ వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. బంగారుపాళ్యంకు చెందిన ఆయన ఎస్వీయూనివర్సిటీలో సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రపంచ బ్యాంకు సౌజన్యంతో ప్రతిష్టాత్మక పరిశోధనా ప్రాజెక్టులు నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాన్ని స్థాపించారు. సీఎం చంద్రబాబు నాయుడుకు సన్నిహితులు.జయసింహులు నాయుడు కుటుంబం తిరుపతి పద్మావతి నగర్‌లో నివాసం ఉండేది. సతీమణి పార్వతి పద్మావతి యూనివర్సిటీ ఉమెన్ స్టడీస్ విభాగంలో ప్రొఫెసర్‌గా, ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. వీరి కుమార్తె అమెరికాలో స్థిరపడ్డారు.ప్రొఫెసర్ జయసింహులు నాయుడు మృతికి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ చైర్మెన్ పొంద్ర సురేంద్ర నాయుడు, నందనం అకాడమీ డైరెక్టర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. జయసింహులు నాయుడు భౌతిక కాయానికి గురువారం మధ్యాహ్నం గోవింద ధామంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

సీఎం చంద్రబాబు సంతాపం : జయసింహులు నాయుడు మృతికి సీఎం చంద్రబాబు సంతాపాన్ని వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో జయసింహులు నాయుడుతో ఎంతో అనుబంధం ఉందన్నారు. ఎంతో మంది విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దారని ఒక ప్రకటనలో నివాళులర్పించారు. తన రచనలు, ప్రసంగాల ద్వారా అనేక మందికి మార్గదర్శిగా నిలిచారని తెలిపారు. ఆయన. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం



రేణిగుంట, జూలై 10: తిరుమల ఎక్స్‌ప్రెస్ రైల్లో స్పెషల్ పార్టీ పోలీసులు 43 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గాజులమండ్యం సీఐ సుబ్బరాయుడు కథనం మేరకు.... 15రోజులుగా గూడూరు రైల్వేస్టేషన్ నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో పోలీసులు జనరల్ బోగీల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 43కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోగా, బుధవారం మాత్రమే 12కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో, రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు.

కౌన్సిల్ గొంతుమారింది

నగరాభివృద్ధికి కలసి పనిచేద్దామని రాజకీయాలకతీతంగా పిలుపు - ఎమ్మెల్యేకి అభినందనల వెల్లువ



సమావేశ ప్రారంభంలో మేయరు పక్కన ఎంపీ, ఎమ్మెల్సీ, కమిషనర్ - ఎమ్మెల్యే శ్రీనివాసులు సూచన తరువాత దూరంగా కూర్చున్న ఎంపీ,ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



మారిన స్వరాలు

తిరుపతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తీరు మారింది. కొందరు వైసీపీ కార్పొరేటర్ల స్వరం మారింది. పలువురు గత వైసీపీ పాలనపై అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చగా మారింది.మొత్తానికి కార్పొరేటర్లు స్వేచ్ఛగా తమ భావాలను పంచుకునేందుకు బుధవారం నాటి కౌన్సిల్ భేటీ వేదికగా మారింది. మేయర్‌కు తగిన గౌరవం దక్కడంతో ఆమె కళ్లలో ఆనందం కనిపించింది. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా వచ్చిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు, ఎంపీ గురుమూర్తికి పార్టీలకతీతంగా అభినందనలు తెలపడం కౌన్సిల్ గౌరవాన్ని పెంచింది. తిరుపతి అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది కలిసి రాజకీయాలకతీతంగా పనిచేద్దామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. అజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదించారు. టీడీఆర్ బాండ్లపై వస్తున్న ఆరోపణలపై నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్పొరేటర్లు తెలియజేసే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని కమిషనర్ అదితిసింగ్ తెలిపారు.

మేయర్‌కు దక్కిన గౌరవం



తిరుపతి ప్రథమ పౌరురాలు, మేయర్ శిరీషకు కౌన్సిల్ సమావేశంలో తగిన గౌరవం దక్కింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాల్లో అప్పటి ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి తమ పార్టీకే చెందిన మేయర్ శిరీషను గాజుబొమ్మను చేసి కూర్చోబెట్టారన్న విమర్శలొచ్చాయి. మేయర్ కుర్చీకి ప్రాధాన్యత ఇవ్వకుండా పక్కన ఎమ్మెల్యేతో పాటు కమిషనరు కూర్చోవడం అనేక ఆరోపణలకు తావిచ్చిన విషయం తెలిసిందే. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బుధవారం తొలి సమావేశం జరిగింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఎక్స్‌అఫిషియో సభ్యుడి హోదాలో సమావేశానికి హాజరయ్యారు. అప్పటికే వేదికపై మేయర్‌కు అటూ,ఇటూ వైసీపీ ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, కమిషనర్ అదితిసింగ్ ఆశీనులయ్యారు. ఎమ్మెల్యేకి కూడా మరొక కుర్చీని వేసి వుంచారు. సమావేశం ప్రారంభమవుతుండగా ఎమ్మెల్యే సెనేట్ హాలుకు చేరుకున్నారు. వేదికపైన ఉన్న తన కుర్చీని కిందవేయమని అధికారులకు సూచించారు. దీంతో ఎంపీ, ఎమ్మెల్సీ కూడా కిందకు దిగేశారు. కమిషనర్ మాత్రం మేయర్ పక్కనే కూర్చుండిపోయారు.మేయర్‌తో సమానంగా ఎవ్వరూ కూర్చోవద్దని, ఆ కుర్చీకి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వాలని, కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లమని ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డిని ఎమ్మెల్యే పిలిచి చెప్పారు. సమాచారం తెలుసుకున్న కమిషనర్ తన కుర్చీ స్థానాన్ని కూడా మార్చుకున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న కార్పొరేటర్లు, అధికారులు మేయర్‌కు దక్కిన గౌరవాన్ని చర్చించుకోవడం కనిపించింది. ఇంతలో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ లేచి తమ కూటమి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వ్యక్తిత్వానికి ఇలాంటి ఘటనే నిదర్శనమన్నారు. పార్టీలకతీతంగా గౌరవించడం ఎన్డీఏ నేతల అభిమతమన్నారు. ఇకపై కార్పొరేటర్లు కూడా వారి డివిజన్లలో స్వేచ్ఛగా ప్రజలకు సేవలందించవచ్చన్నారు. పలువురు అభినందనలు తెలపడంతో మేయర్ కళ్లలో ఆనందం కనిపించింది.

ఐదేళ్లు నరకమనుభవించాం



కార్పొరేషన్లో గత ఐదేళ్లు నరకం అనుభవించాం. ప్రజలు కట్టిన పన్నులకు లెక్కలు లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కార్పొరేషన్లో మాకు తెలియకుండా చాలా జరిగిపోయాయి. అందుకే ప్రజలు భారీ మెజారిటీతో జనసేన పార్టీని గెలిపించారు. కార్పొరేషన్‌లో అవినీతిపై విచారణ జరిపించాలని సీఎం, డిప్యూటీ సీఎంలకు ఫిర్యాదు చేస్తాం.

- డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

కార్పొరేటర్ అంటే ఇంతకాలం తెలియలేదు

ఇంతకాలం కార్పొరేటర్ అంటే ఏమిటో ఎవరికీ తెలియలేదు. ఇప్పుడైనా మనమేంటో తెలుసుకోవాలి. టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై విచారణ జరిపించి, వాస్తవాలు ప్రజలకు తెలపాలి. మాస్టర్ ప్లాన్ రోడ్ల నాణ్యత పరీక్షించిన తర్వాతే పెండింగ్ బిల్లులు చెల్లించాలి. డబుల్ డెక్కర్ బస్సును కంపోస్టుయార్డులో పెట్టడం బాధాకరం. దానిని అందుబాటులోకి తీసుకురావాలి. గతంలో శ్రీకృష్ణ దేవరాయల కాంస్య విగ్రహాన్ని తొలగించి, ఎక్కడో పడేసి, ఆ స్థానంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఫైబర్ విగ్రహం పెట్టి ప్రజల మనోభావాలను దెబ్బతీశాం.

- దొడ్డారెడ్డి ప్రతాప్ రెడ్డి, కార్పొరేటర్

పలమనేరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయండి

గంగవరం, జూలై 10 : పలమనేరు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు కిడ్నీ వ్యాధిగ్రస్థులు డయాలసిస్‌కు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పలమనేరులో డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేసేలా సహకరించాలని పీపీఎస్ నాయకులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి విన్నవించారు. బుధవారం పలమనేరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేని కలసి పట్టణ సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రధాన కూడళ్లు, రహదారుల్లో రోడ్లను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని రోడ్లపై వ్యాపారాలు చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న పెద్దచెరువును ఆధునీకరించి, పలమనేరు డిపో నుంచి వెళ్లిపోయిన బస్సులన్నింటినీ మళ్లీ రప్పించి, కొత్తబస్సులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీపీఎస్ అధ్యక్షుడు సుబ్రమణ్యంపిళ్ళై, నరసింహులు ఆనంద బాబు, విజయకుమార్, పొన్నుడి, మురళి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



పుంగనూరు, జూలై10: ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపొంది సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తే పాదయాత్రగా వచ్చి మొక్కు తీర్చుకుంటామని నిర్ణయించుకున్న పుంగనూరు టీడీపీ కార్యకర్తలు బుధవారం తిరుమలకు బయలుదేరారు. పుంగనూరు మండలంలోని టీడీపీ కార్యకర్తలు సుబ్రహ్మణ్యం, రాజశేఖర్, మెకానిక్ మణి, ఆనంద్, శంకర్‌లు స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన కాలినడకన వెళ్లారు. మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, టీడీపీ నాయకులు పోలీస్‌గిరి, సీవీరెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, దేశాధిప్రకాశ్, గంగాధర్, వెంకటరెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులురెడ్డి, సుబ్బన్న, జనసేన నాయకులు విరూపాక్షి, హరినాయక్, నరేశ్‌రాయల్, చైతన్యరాయల్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బడి మానేసిన విద్యార్థులపై శ్రద్ధ చూపండి

సోమల, జూలై 10: బడి మానేసిన విద్యార్థులపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని ఎంఈవో శ్రీరాములు కోరారు. బుధవారం పెద్దఉప్పరపల్లె హైస్కూల్‌ను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, బడికి రాని పిల్లల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వైద్యపరీక్షల వివరాలను, ఆరోగ్య పరిస్థితులను ఉపాధ్యాయులతో సమీక్షించారు. అలాగే ఆవులపల్లె, కలమందలవారిపల్లె, రాంపల్లె పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులను పాటించాలి

కల్లూరు, జూలై10: సమగ్ర సస్యరక్షణ, ఉత్తమ యాజమాన్య పద్ధతులను రైతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి లక్ష్మీప్రసన్న, మండల వ్యవసాయధికారి శ్రీనివాసులు తెలిపారు. పులిచెర్ల ఆర్బీకే కేంద్రంలో బుధవారం ప్రకృతి వ్యవసాయం, ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగుచేస్తే మంచి దిగుబడి సాధ్యమవుతుందన్నారు. పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయంవైపు రైతులు దృష్టి సారించాలన్నారు. సమతుల్య ఎరువులను వాడి భూసారాన్ని పెంపొందించుకోవాలన్నారు. పంటల సాగుకు సంబంధించిన వివిధ రకాల అంశాలపై అవగాహనతో ముందుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ భక్తులకు మెరుగైన సేవలే లక్ష్యం

చౌడేపల్లె, జూన్10: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ భక్తులకు మెరుగైన సేవలే లక్ష్యంగా ఆలయ అధికారులు పనిచేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆదేశాలతో బోయకొండలో ఈవో ఏకాంబరంతో కలసి భక్తులకు క్యూలైన్లలో ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వీఐపీ దర్శనాలతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే కొన్నిరోజులుగా జరుగుతున్న అనధికార దర్శనాలను నిలిపేందుకు, ఆలయ ఆదాయం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీఐపీలకు, దాతలకు, వివిధ రకాల సేవలకోసం పీఆర్‌వో కౌంటర్ ఏర్పాటు చేసి సేవలందించనున్నట్లు తెలిపారు. ఇక నుంచి వీఐపీలు కూడా ఉచిత దర్శనం లేకుండా టికెట్ చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్ రాజు, గిరిరాజు, సుబ్బు, కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

పుంగనూరు రూరల్, జూలై10: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని జనసేన మండలపార్టీ అధ్యక్షుడు విరూపాక్షి కోరారు. బుధవారం మండలంలోని సుగాలిమిట్ట, ఏతూరు గ్రామ సచివాలయాలకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించడం వల్ల దోమలు పెరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చైతన్యరాయల్, హరినాయక్, బాలాజీ నాయక్, చంద్ర, మునినాయక్, పవన్‌నాయక్, రమణ, శ్రీన, హరీష్, గంగాధర్, రెడ్డి, సునీల్‌లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

పుంగనూరు. జూలై10: పుంగనూరులో పారిశుధ్యంపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని ఎస్‌డీపీఐ నాయకులు కోరారు. పట్టణంలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని వారు బుధవారం మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10, 11, 12 వార్డుల్లో చెత్త ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగి జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, వెంటనే పారిశుధ్య పనులు చేయాలని కోరారు. నాయకులు యూసఫ్, జబివుల్లా, యూనుస్, సుహేబ్, యతిన్ పాల్గొన్నారు.

విద్యార్థుల పెండింగ్ మెస్ చార్జీలు చెల్లించాలి

పుంగనూరు రూరల్, జూలై10: విద్యార్థులకు చెల్లించాల్సిన పెండింగ్ హాస్టల్ మెస్ చార్జీలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలంటూ ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఉత్తన్న డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, మెడికల్‌కాలేజీలు తదితర వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. అనంతరం ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షుడుగా లోకేశ్, కార్యదర్శిగా సంతోష్, ఉపాధ్యక్షులుగా గంగోత్రి, ముభాకర్, సునీల్‌కుమార్, అజయ్‌కుమార్, తేజకుమార్, తులసీరాం, సంజయ్‌కుమార్, శ్రీకాంత్, శిరీషా, జయలక్ష్మి, హేమశ్రీ, అర్చన, పూజలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంగరాజు, సిద్దుసత్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

రామకుప్పం, జూలై 10: రామకుప్పం మండలం ముద్దనపల్లె గ్రామ సచివాలయాన్ని కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, కుప్పం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ బుధవారం సందర్శించారు. సచివాలయ సిబ్బందికి ప్రజాసమస్యలు, ప్రభుత్వ విధానాలపై సూచనలు చేశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో స్థానిక నేతలు వెంకటరమణ, రఘు, మురళీ, ముంజునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

రొంపిచెర్ల,జూలై10: మండలంలోని రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులపై జిల్లా వనరుల వ్యసాయాధికారిని లక్ష్మీప్రసన్న బుధవారం అవగాహన కల్పించారు. రొంపిచెర్ల రైతు భరోసా కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యసాయం, జీవన ఎరువులు వాడకం, సమగ్రపోషణ, భూపరీక్షలపై అవగాహన కల్పించారు. క్రిమిసంహారక మందుల గురించి వివరించారు. వ్యసాయాధికారి శ్రీనివాసులు, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన

బైరెడ్డిపల్లె, జూలై 10 : బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలుకు ఆరోగ్యసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. గర్భిణులు ప్రతినెలా రక్తపరీక్షలు చేయించుకుని పోషకాహారం తీసుకుంటూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని వివరించారు. అలాగే తల్లిపాల ప్రాముఖ్యత, వ్యాధినిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ, సీజనల్ వ్యాధుల నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, ఏఎన్ఎం లక్ష్మి, ఆశాకార్యకర్తలు రాజేశ్వరి, ముబీన, జయమ్మ, భారతి పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పలమనేరు ఎస్ఐగా వెంకటనరసింహులు



గంగవరం, జూలై 10: పలమనేరు ఎస్ఐగా వెంకట నరసింహులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా ఉన్న శివశంకర్ సోమల పోలీస్ స్టేషన్‌కు బదిలీకావడంతో, ఆయన స్థానంలో సోమలలో పనిచేస్తున్న ఎస్ఐ వెంకట నరసింహులును పలమనేరుకు బదిలీచేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. దీంతో బుధవారం ఆయన పలమనేరు పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతలను పరిరక్షించడానికి సిబ్బందితో కలసి సమన్వయంతో పనిచేయడానికి కృషి చేస్తామన్నారు.

నేడు దుర్యోధన వధ ఘట్టం

కల్లూరు, జూలై 10: పులిచెర్ల మండలం మంగళంపేటలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్యోధన వధ ఘట్టం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వహకులు తెలిపారు. దుర్యోధన వధ ఘట్టం వేడుకలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని నిర్వహకులు కోరారు.

మునీశ్వరుడికి ప్రత్యేక పూజలు



గుడుపల్లె, జూలై 10: మండల పరిధిలోని జాతికర్తనపల్లెలో మునీశ్వరుడికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునీశ్వరుడి వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మునీశ్వరుడి ఉత్సవర్లను అలంకరించి ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



గుడుపల్లె, జూలై 10:గుడుపల్లె, శెట్టిపల్లెలలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, విద్యాసామగ్రిని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్య ఒక్కటే ఆర్థిక అసమానతలను తొలగిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. పాఠశాలలో సమస్యలు ఉంటే తెలిపితే పరిష్కరిస్తానని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజికవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, మండాలాధ్యక్షుడు బాబునాయుడు, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శివశంకర్, ఎంఈవో శ్రీదేవి, సర్పంచ్ రీటా ఎల్లప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు



పుంగనూరు రూరల్, జూలై10:ఆర్టీసీకి ఆదాయం చేకూర్చిన ఉద్యోగులకు ప్రోత్సాక బహుమతులను పుంగనూరు డిపో మేనేజర్ సుధాకరయ్య అందజేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీ సంస్థకు డీజల్ ఆదా చేయడం, అధికంగా ఆదాయాన్ని చేకూర్చిన ఉద్యోగులు డ్రైవర్లు జీ.ఎం. బాషా, ఫరోజ్‌బాషా, దిలీప్‌కుమార్, కండక్టర్లు బి.జి.బాబు, ప్రియాలను ఆయన అభినందించారు.

13న పుంగనూరులో చెస్ పోటీలు

పుంగనూరు రూరల్, జూలై10: లయన్స్‌క్లబ్, గురుకులం చెస్‌క్లబ్ సంయుక్తంగా ఈ నెల 13న పుంగనూరులో చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజర్ మణికంఠ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని తూర్పుమొగసాల మున్సిపల్‌పాఠశాల ఆవరణలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో గెలిపొందిన విద్యార్థులకు ఈనెల 18న నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు సెల్ నెంబర్ 9581432310ను సంప్రదించాలని ఆయన కోరారు.

16న వాహనాల వేలం

పుంగనూరు రూరల్, జూలై10: అక్రమ మద్యం తరలింపు కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 16న బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ సీఐ భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కేసుల్లో పట్టుబడిన కారు ఒకటి, ఆటో ఒకటి, 23 ద్విచక్రవాహనాలు బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు డిపాజిట్లు చెల్లించి పాల్గొనాలని ఆమె కోరారు.

అనుమానాస్పద స్థితిలో మృతి



కుప్పం రూరల్, జూలై 10: కుప్పం మండలం బ్రహ్మదేవర చేన్లు గ్రామంలో శక్తివేల్ (45) అనే వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... శక్తివేల్‌తో విభేదాలు వచ్చి ఆయన భార్య వేరే చోటికి వెళ్లిపోయింది. దీంతో శక్తివేల్ మద్యానికి అలవాటు పడ్డాడు. బీడీ చేన్లు గ్రామ శివారు ప్రాంతంలో బుధవారం శక్తివేల్ శవమై తేలాడు. ముఖంపై రక్త గాయాలున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే నాటుసారా తాగడంవల్లే శక్తివేల్ మృతి చెందాడని కుప్పం అర్బన్ సీఐ జీటీ.నాయుడు తెలిపారు.

మిగులు భూములపై స్పెషల్ డ్రైవ్

రైతులూ.. ఆధార్ లింక్ చేసుకోండి

కుప్పం, జూలై 10: కుప్పం నియోజకవర్గంలో భూములకు ఆధార్‌ను అనుసంధానించే ప్రక్రియ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించడానికి రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది. ఈనెల 4న కలెక్టర్ సుమిత్ కుమార్ కుప్పంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఈ సమస్యపై రైతుల నుంచి పలు వినతులు అందడంతో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఎక్కడికక్కడ గ్రామ సభలు పెట్టి, రైతులనుంచి వినతులు స్వీకరించి ఆయా భూముల ఖాతా నెంబర్లను ఆధార్‌తో లింక్ చేసి ఆన్‌లైన్ చేయాల్సిందిగా కలెక్టర్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్లను ఆదేశించారు. ఈ ప్రక్రియ మొత్తం వారం రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో కుప్పం తహసీల్దారు హరికుమార్ బుధవారం మండలంలోని వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వీఆర్వోలు మూడు బృందాలుగా ఏర్పడి గ్రామాలలో పర్యటించి సభలు నిర్వహించాలని సూచించారు. పట్టాదారు పాసుపుస్తకాలను పరిశీలించి పక్కాగా హక్కుదారువేనని నిర్ధారించుకున్న తర్వాతే ఆధార్ లింక్ చేయాలన్నారు. ఇందులో పొరపాట్లు జరిగితే మళ్లీ కలెక్టర్ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. కాగా ఆధార్ నెంబర్ లింక్ కాని భూములకు ఖాతా నెంబర్లు ఉన్నాసరే, వివరాలు 1 బికి ఎక్కక పోవడంతో రైతులు వాటిని పొందలేరు. భూముల రిజిస్ట్రేషన్ సమయాల్లో ఇది పెద్ద సమస్యగా మారుతుంది. ఆధార్ లింక్ కాని రైతులు అధికారులను సంప్రదించి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు.



మిగులు భూములపై సమీక్షిస్తున్న తహసీల్దారు హరికుమార్

పలమనేరు మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి : అమర్

గంగవరం, జూలై 10: పలమనేరు మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత మొట్టమొదటి సారిగా బుధవారం మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆయన చేరుకోవడంతో స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ చామండేశ్వరి, వైస్ ఛైర్‌పర్సన్ రవితోపాటు మున్సిపల్ కమిషనర్, సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే అమర్ ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా బాధ్యతలు స్వీకరించి ప్రసంగించారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సభ్యులు, అధికారులు కలసి రావాలన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశం ప్రారంభమవగా, అజెండాలోని అంశాలన్నింటినీ ఆమోదించారు. పలమనేరులో గంజాయి విక్రయిస్తుండడంతో అకతాయిల ఆగడాలు మితిమీరిపోతున్నాయని, సచివాలయాల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉందని, తాగునీటి పైప్‌లు మరమ్మతులకు గురై నీటిసరఫరా చేయడానికి ఇబ్బందులు పడుతున్నామని పలువురు కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారులు చెప్పిన సమాధానాలు పొంతనలేకుండా ఉండడంతో, అధికారుల తీరుపై సభ్యులు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, తహసీల్దార్ రంగనాయకులుతోపాటు పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి





పుంగనూరు ఐసీడీఎస్ కార్యాలయం ముందు అంగన్‌వాడీల నిరసన, శాంతిపురంలో అధికారులకు వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

పుంగనూరు రూరల్, జూలై10: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ నాయకులు(అంగన్‌వాడీ కార్యకర్తలు) డిమాండ్ చేశారు. బుధవారం పుంగనూరు మండలం రాంపల్లెలోని ఐసీడీఎస్ కార్యాలయం ముందు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి యేటా జూలై 10న అంగన్‌వాడీల కోర్కెల దినంగా ప్రకటించడంతో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, 42 రోజుల సమ్మెకాలంలో ప్రభుత్వం మినిట్స్ కాపీలో అంగీకరించిన అంశాలకు జీవోలు ఇవ్వాలని, 4 లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, ఐసీడీఎస్ ప్రైవేటీకరణ ఆపాలని, రాజకీయ వేధింపులకు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ నాయకురాలు కల్పన, లీలావతి, పద్మ, పుణ్యవతి, వీణాకుమారి, చంద్రావతమ్మ, జ్యోత్స్న, అంజిలి తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం : మండల కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం 26 వేలు, పెన్షన్, పిఎఫ్. ఐస్ఐ అమలు చేయాలన్నారు. గ్రాట్యుటీ అందజేలన్నారు. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిచాలని కోరుతూ మండల అధికారులకు వినతి పత్రం అందించారు

గంగవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు ఓబులరాజు, గిరిధరగుప్త మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను బలోపేతం చేసి అంగన్వాడీ వర్కర్ల కోసం బడ్జెట్‌ను పెంపుదల చేయాలన్నారు. ఎన్నికలు అయిన తరువాత పలు జిల్లాల్లో అంగన్వాడీ వర్కర్లను కొంతమంది నాయకులు వేదించి రాజీనామాలు చేయాలని వేధిస్తున్నారని, ఈ వేధింపులపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.



పలమనేరులో ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

చోరీకి గురైన వాహనం స్వాధీనం : ముగ్గురి అరెస్టు

రామకుప్పం, జూలై 10: రామకుప్పం పట్టణంలో జూన్ 29వ తేదీ రాత్రి చోరీకి గురైన మినీ టెంపోను పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్ యాదవ్ కథనం మేరకు..రామకుప్పం పట్టణానికి చెందిన మధు జూన్ 29వ తేదీ రాత్రి మినీ టెంపోను ఇంటి ముందు నిలిపి ఉంచాడు. 30న తెల్లవారుజామున చూస్తే కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం వచ్చిన సమాచారం మేరకు సీఐ మల్లేష్ యాదవ్, రాళ్లబూదుగూరు, గుడుపల్లె ఎస్ఐలు నరేష్, శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి ఆరుమానిపెంట చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ మినీ టెంపో నుంచి ముగ్గురు వ్యక్తులు వారిని చూసి పారిపోతుండగా అనుమానం వచ్చి వారిని వెంబడించి పట్టుకొన్నారు. తమిళనాడుకు చెందిక ప్రభు(56), ఎరుగుత్తికి చెందిన పళణి(38), పరదరామికి చెందిన వాహిద్ మాలిక్(30)లుగా గుర్తించారు. రామకుప్పం పట్టణంలో మినీ టెంపోను చోరీకి పాల్పడింది తామేనని వారు విచారణలో వెల్లడించారు. వారి నుంచి మినీ టెంపోను స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. ఈ కేసులో చురుగ్గా వ్యవహరించిన పోలీసులకు సీఐ మల్లేష్ యాదవ్ నగదు రివార్డులు అందజేశారు.



స్వాధీనం చేసుకున్న టెంపో, నిందితులతో పోలీసులు

టీచ్ టూల్ శిబిరాన్ని తనిఖీ చేసిన రాష్ట్ర పరిశీలకుడు

గంగవరం, జూలై 10 : పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణా శిబిరాన్ని బుధవారం స్టేట్ అబ్జర్వర్ బాలకృష్ణ తనిఖీ చేశారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు క్లాస్‌రూమ్ అబ్జర్వేషన్‌కు వెళ్లేటప్పుడు శిక్షణలో నేర్చుకున్న విషయాలను గుర్తు పెట్టుకోవాలన్నారు. శిక్షణ పొందిన అంశాలపై క్లాస్‌రూమ్‌లో ఉపాధ్యాయులు చెప్పిన బోధనను పరిశీలించిన తరువాత, అ డేటాను రాష్ట్ర కార్యాలయానికి పంపుతారని, తద్వారా బోధన ఏ విధంగా చెప్పాలో అన్న అంశంపై పరిశీలించి దానికి తగ్గట్లు ఉపాధ్యాయులను తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లీలారాణి, అన్సర్, గౌస్‌బాషా, ధనంజయాచారి, నారాయణస్వామి, ఖాతర్‌బాషా, తేజ్‌కుమార్ పాల్గొన్నారు.

మా ఊరికి బస్సు వచ్చిందోచ్...

ఐదేళ్ల తరువాత నారాయణపురం తాండాకు బస్సు సర్వీసు పునరుద్ధరణ

రామకుప్పం, జూలై 10: ఐదేళ్ల తరువాత తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు వచ్చిందని రామకుప్పం మండలం నారాయణపురం తాండాకు గ్రామస్తులు, టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు తమ గ్రామం నుంచి కుప్పానికి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని టీడీపీ నేతలు విన్నవించడంతో బుధవారం ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసు పునరుద్ధరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఆనందరెడ్డితోపాటు, స్థానిక టీడీపీ నేతలు బస్సు డ్రైవర్, కండక్టరును ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి, రామునాయక్, జైపాల్ నాయక్, మదేశ్ నాయక్, భాస్కర్ నాయక్, రాఘవ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు డ్రైవర్, కండక్టర్లను సన్మానిస్తున్న గ్రామస్తులు, టీడీపీ నేతలు

పశుగ్రాస విత్తనాల పంపిణీ

శాంతిపురం, జూలై 10: మండలం కేంద్రంలోని పశు వైద్యశాలలో పాడిరైతులకు ప్రభుత్వం సబ్సిడీతో పశుగ్రాసం విత్తనాలను బుధవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో అందించే పశుగ్రాసం విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశుగ్రాసం విత్తనాలు కావాల్సిన రైతులు డబ్బులు చెల్లించి రైతు భరోసా కేంద్రాల్లో తీసుకోవచ్చునని ఆయన తెలిపారు.

దోమల బెడద నివారించండి

బైరెడ్డిపల్లె, జూలై 10 : బైరెడ్డిపల్లె పట్టణంలో దోమలబెడద నివారణకు పంచాయతీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దోమల కారణంగా వ్యాధులు కూడా ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో మురుగునీటి కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించాలని, దోమల నివారణకుగాను అబేట్ ద్రావణం పిచికారీ, ఫాగింగ్ చేయించాలని కోరుతున్నారు.

ఇసుక దోపిడీకి చరమగీతం

రొంపిచెర్ల, జూలై10: టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుతో ఇసుక దోపిడీకి చరమగీతం పాడుతూ ఎన్నికల హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ప్రజలు, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు చల్లాబాబును కలిసి సమస్యలు తెల్పగా పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం అమల్లోకి రావడంతో ఆంధ్రాలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. రొంపిచెర్ల, చౌడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు ఉయ్యాలరమణ, రమేష్‌రెడ్డి, నాయకులు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఉద్యోగ సంఘ నేతపై కేసులను ఎత్తేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

చిత్తూరు, జూలై 10: ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణపై ఉన్న అక్రమ కేసులను ఎత్తి వేయాలని ఈ సంఘ జిల్లా అధ్యక్షుడు శివయ్య, కార్యదర్శి హరిప్రసాద్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులతో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతం ఇవ్వాలని గవర్నర్‌ను కలిసినందుకు గత ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని తెలిపారు. ఉద్యోగుల పట్ల అమానుషంగా ప్రవర్తించిన ప్రభుత్వంపై పోరాటం చేసిన నేతపై కేసులు పెట్టడం సరికాదని, కొత్త ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఆర్వో పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు దేవకుమార్, నరేష్ బాబు, గౌరీ శంకర్, చలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు, జూలై 10: నగరంలో పారిశుధ్య పనుల పట్ల నిర్లక్ష్యం వద్దని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె వేలూరు రోడ్డు, గంగినేని చెరువు, గిరంపేట, దుర్గమ్మ గుడి, కలెక్టరేట్ సర్కిల్ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. గంగినేని చెరువు వద్ద వాహనాల లాగ్‌బుక్‌లను తనిఖీ చేశారు. ప్రత్యేక పారిశుధ్య పనుల నేపథ్యంలో అదనపు ట్రిప్పులు నడపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమరనాథరెడ్డి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), జూలై 10: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తవణంపల్లె మండలం కొండ్రాజుకాలువకు చెందిన దినకరనాయుడు బుధవారం రూ.1,00116 విరాళంగా అందించారు. దాతను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి స్వాగతించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 10: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని గురువారం జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జనాభా నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, మాతృ ఆరోగ్యం వంటి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడమే దినోత్సవ లక్ష్యమన్నారు. దానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏసీఎంవోగా జయప్రకాష్‌నాయుడు



చిత్తూరు (సెంట్రల్), జూలై 10: సమగ్రశిక్ష అసిస్టెంట్ కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (ఏసీఎంవో)గా వి.జయప్రకాష్‌నాయుడు బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈయన 2014-18 మధ్య ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఆయన్ను కలిసి అభినందించారు. కాగా, జిల్లా ఉమ్మడి పరీక్షల కేంద్రం జిల్లా కార్యదర్శిగా పరశురాంనాయుడు సైతం బుధవారం పీసీఆర్ ఉన్నత పాఠశాలలోని తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

రామభద్రాపురం సంఘమిత్రగా పుష్ప



గుడిపాల, జూలై 10: రామభద్రాపురం గ్రామ పంచాయతీ సంఘమిత్రగా పుష్పను మహిళా సంఘాల సభ్యులతో కలసి ఏపీఎం సుధారాణి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఈమె సంఘమిత్రగా పనిచేస్తుండగా వైసీపీ ప్రభుత్వం తొలగించి, హేమను నియమించింది. హేమ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో పంచాయతీలోని దాయం వారిపల్లె, రామభద్రాపురం, చుక్కావారిపల్లి, ముట్టుకూరుపల్లి, గాండ్లపల్లి, అనుపు గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాల సభ్యుల తీర్మానంతో మళ్లీ పుష్పను నియమించుకున్నారు.

పేదలకు అన్నదానం



గుడిపాల, జూలై 10: మాజీ ఎంపీపీ దీపశ్రీ, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్ దంపతుల కుమారుడి జన్మదినం సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో బుధవారం గుడిపాల అన్నక్యాంటీన్‌లో అన్నదానం చేశారు. మండల నాయకులు రమేష్ నాయుడు, దొరబాబు, కిట్టు, శివలింగారెడ్డి, పుణ్యకోటి పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర



ఊరేగుతున్న అంకమ్మ

విజయపురం, జూలై 10: మండలంలోని బూచివానత్తం పంచాయతీ అంకమ్మ కాలనీలో బుధవారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. వీధుల్లో వేపతోరణాలు కట్టి విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి ఆర్చి ఏర్పాటు చేశారు. ఉదయం అమ్మవారికి అంబలి పోసి, మొక్కు తీర్చుకున్నారు. రాత్రి పురవీధుల్లో ఊరేగించారు.

ముగిసిన టీచ్‌టూల్ శిక్షణ



నగరి, జూలై10 : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న టీచ్‌టూల్ శిక్షణ బుధవారంతో ముగిసింది. కోర్సు డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో బోధన మెరుగుపరిచేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు.

రేపు దేశమ్మ ఆలయ గుత్తహక్కుల వేలం

నగరి, జూలై10: స్థానిక టీఆర్‌కండ్రిగలో వెలసిన దేశమ్మ ఆలయ ఆదాయ వనరుల గుత్తహక్కుల వేలం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఈవో రామచంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు ఒకటి నుంచి 2025 ఆగస్టు 31వ తేదీ వరకు హక్కులు వర్తిస్తాయని పేర్కొన్నారు. తలనీలాలు, పార్కింగ్, దుకాణ సముదాయాలు, కొబ్బరి చిప్పల సేకరణకు వేలం ఉంటుందని, పూర్తి వివరాలకు ఈవో కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

గంగజాతరలో ఎమ్మెల్యే భానుప్రకాష్



నగరి, జూలై10: కాకవేడులో బుధవారం జరిగిన గంగజాతరలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు. అనంతరం మండల పరిధిలోని మూలనత్తంలో టీడీపీ నాయకుడు మునస్వామి కుమార్తె వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు.

వర్షాలకు కోసుకుపోయిన రోడ్డు



గుడిపాల, జూలై 10: మండలంలోని నరహరిపేట క్రాస్ నుంచి కమ్మతిమ్మాపల్లి వెళ్లే రహదారిలో రోడ్డు వర్షాలకు కోసుకుపోయింది. ఈ కారణంగా ఇటు ప్రయాణికులు, అటు వాహనదారులు ఇబ్బందులకు గురౌతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు పక్కకు జరిగి రోడ్డెక్కాలన్నా అవస్థలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమయపాలన లేని గ్రంథాలయం



10 గంటలైనా తెరుచుకోని గ్రంథాలయం

గుడిపాల, జూలై 10: గుడిపాల గ్రంథాలయ నిర్వాహకులు సమయపాలన పాటించడం లేదు. ఉదయం 10 గంటలకు కూడా తెరవకపోవడంతో పాఠకులు ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4నుంచి 6 గంటల వరకు గ్రంథాలయం తెరచి ఉంచాలి. బుధవారం ఉదయం 10 గంటలకు కూడా గ్రంథాలయం తెరచుకోకపోవడంతో పాఠకులు అసహనం వ్యక్తం చేశారు.

ఇసుక టిప్పర్ సీజ్



పాలసముద్రం, జూలై 10: చిత్తూరు రూరల్ మండలం నుంచి పాలసముద్రానికి ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పాలసముద్రం ఎస్‌ఐ భారతి బుధవారం సీజ్ చేశారు. ఎలాంటి రసీదూ లేకుండా పాలసముద్రం మండలం రాచపాళ్యం గుండుబావి సర్కిల్ వద్ద ఇసుక లోడ్ చేసుకుని, తమిళనాడుకు తరలించడానికి ప్రయత్నిస్తుండగా పాలసముద్రం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ సంజీవ్‌కుమార్‌ను అరెస్టు చేసి, టిప్పర్ ఓనర్ కిరణ్‌పై కేసు నమోదు చేశారు.

కుంటల మరమ్మతుకు ప్రాధాన్యతివ్వాలి

పాలసముద్రం, జూలై 10: మండలంలో జరుగుతున్న ఉపాధి పనులలో భాగంగా కుంటల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచి, వర్షపు నీటి నిల్వ ఉండేటట్లు చూడాలన్నారు. ఏపీవో మార్గరెట్, ఈసీ అనూష పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

వెదురుకుప్పం, జూలై 10: మండలంలోని నల్లవెంగనపల్లె ధర్మరాజ సమేత ద్రౌపదీ అమ్మవారి ఆలయ వార్షిక ఉత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 21వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయి. భక్తులకు కాలక్షేపం కోసం పగలు హరికథ, రాత్రి వీధి నాటకాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త గాలి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యనిర్వాహకులు గాలి నాదమునినాయుడు, వెంకటరత్నం తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ

వెదురుకుప్పం, జూలై 10: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ ప్రవీణ తెలిపారు. బుధవారం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.



గుంతలమయంగా కొట్రకోన కొత్తూరు రోడ్డు - కంకరతేలిన పుత్తూరు-బొమ్మవారిపల్లె రోడ్డు

ఛిద్రమైన రోడ్లపై ప్రయాణమెట్లా?



దళవాయిపల్లె - సంసాపురం రహదారిలో గుంతలు



బురదమయంగా కాళేపల్లెకు సమీపంలో హైవేరోడ్డు బ్రిడ్జి

గంగాధరనెల్లూరు, జూలై 10: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు రోడ్లు ఛిద్రమై వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. వరత్తూరు పంచాయతీలో దళవాయిపల్లె - సంసాపురం మీదుగా కుమ్మరపల్లె రోడ్ క్రాస్ వరకు, చిత్తూరు - పుత్తూరు రహదారి కలిజవేడు పంచాయతీ బొమ్మవారిపల్లె బస్టాప్ వద్ద నుంచి బొమ్మవారిపల్లె మీదుగా పాపిరెడ్డిపల్లె వరకు, మేనాటంపల్లె గ్రామం వద్ద నుంచి కనికాపురం, ఒగ్గువారిపల్లె మీదుగా కాళేపల్లె దళితవాడ వరకు, వేల్కూరు బస్టాప్ నుంచి పెద్దకాల్వ, కె.కొత్తూరు (ముకుందరాయనిపేట) మీదుగా కొట్రకోన వరకు, కొత్త వెంకటాపురం సచివాలయానికి సమీపం నుంచి ఆదిఆంధ్రవాడ తమిళనాడు సరిహద్దు వరకు, గంగాధరనెల్లూరు హైస్కూల్ నుంచి రెడ్డేపల్లె, ఇ.ఆర్.కండ్రిగ, ఎ.వెంకటాపురం, అగరమంగళం, చీర్లవారిపల్లె, వి.లక్ష్మిరెడ్డిపల్లె వరకు తారురోడ్డు ధ్వంసమై గుంతలమయంగా మారింది. పాచిగుంటమిట్ట నుంచి కొండ్లసందూరు మీదుగా పిళ్లారికుప్పం వరకు మట్టి రోడ్డు కోతకు గురై అధ్వానంగా తయారైంది. చిత్తూరు - తచ్చూరు హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా ముసలయ్యగారిపల్లె బ్రిడ్జి కింద, కాళేపల్లెకు సమీపంలో హైవే బ్రిడ్జి కింద నీరు నిలిచిపోయి బురదమయంగా మారింది. ఈ రోడ్లలో ద్విచక్ర వాహనాలు, కార్లు, స్కూలు వ్యాన్‌లు, అంబులెన్స్‌లు ప్రయాణాలు సాగించాలంటే అవస్థలు పడాల్సి వస్తోంది. ఎమ్మెల్యే థామస్ స్పందించి, రోడ్లను బాగుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

యువత ఉపాధి కల్పనకు కృషి : దగ్గుమళ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ప్రసాదరావు

తవణంపల్లె, జూలై 10 : యువత స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలని, ఉద్యోగ కల్పన, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. మండలంలోని కాణిపాకంక్రాస్ వద్దనున్న కల్యాణ మండపంలో బుధవారం పూతల పట్టు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జిల్లా సర్వతోభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ క్యాడర్‌కు సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని, అదే సమయంలో నష్టం చేకూర్చే పనులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాలి దిలీప్, జిల్లా అధ్యక్షుడు రాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, మండల కార్యదర్శి మధు, క్లస్టర్ ఇన్‌చార్జి సునీల్‌చౌదరి, నాయకులు సుధాకర్‌నాయుడు, శరవణ, వినాయక, గోపియాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పేరుతో మోసం చేసే వారిని నమ్మొద్దు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కార్వేటినగరం, జూలై 10: ఎమ్మెల్యే పేరు చెప్పి అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిని నమ్మవద్దని, వారి మాయమాటలకు మోసపోవద్దని జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. నిజమైన సమస్య లను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కా రం చూపుతానని పేర్కొన్నారు. కార్వేటినగరం ఎంపీడీవో కార్యాల యంలో బుధవారం చేపట్టిన 'సమస్య మీది.. పరిష్కారం నాది' కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో మొత్తం 604 అర్జీలు వచ్చాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ సమస్య ఉన్న వాట్సాప్‌లో మెజేస్ పెడితే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తనపై తప్పుడు ప్రచారం ఎక్కువైందని, తాను లంచం తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో నగరి ఆర్డీవో వెంకటరెడ్డి, ఎంపీడీవో శ్రీధర్ నాయుడు, తహసీల్దార్ పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు సూచనలిస్తున్నహెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి

వెదురుకుప్పం, జూలై 10: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వర్షాకాలంలో నీరు, చెత్త నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హెచ్‌ఎం లలితకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ పద్మ, ఏఎన్‌ఎం కవిత పాల్గొన్నారు.

బైక్ చోరీ కేసులో నిందితుల అరెస్ట్



గంగాధరనెల్లూరు, జూలై 10: ద్విచక్ర వాహనం చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి సీఐ లక్ష్మన్న తెలిపారు. వారి నుంచి మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన మణికంఠ నల్లరాళ్లపల్లె వద్ద కొత్తగా నిర్మిస్తున్న ఇంటివద్ద ఉంచిన బైక్ జూన్ 25వ తేదీన చోరీకి గురైంది. ఆయన ఫిర్యాదు మేరకు జీడీ నెల్లూరు ఎస్‌ఐ ఉమామహేశ్వరరెడ్డి దర్యాప్తు చేపట్టారు. బుధవారం చిత్తూరు - పొన్నై రహదారి పక్కన ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారని తెలుసుకుని అరెస్టు చేసి, విచారించారు. వారు తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై జిల్లా, వెంబాకం తాలుకా పరిధిలోని అసనంపేటకు చెందిన దినేష్ (21), అన్నామలై (23), వడమనబాకంకు చెందిన కరుణాకరన్ (18)గా గుర్తించారు. వారి నుంచి మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారి ముగ్గురిపై వేర్వేరు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయని విచారణలో వెల్లడైంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ పేర్కొన్నారు.

పొలకల పంచాయతీని ఆదుకోండి



దగ్గుమళ్లకు వినతిపత్రం సమర్పిస్తున్న సురేంద్ర నాయుడు

ఐరాల(కాణిపాకం), జూలై 10: మండలంలోని పొలకల పంచాయతీ సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఉప సర్పంచ్ బత్తలపల్లె సురేంద్రనాయుడు బుధవారం కాణిపాకంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును కోరారు. గతంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.50 లక్షలు మంజూరు చేసిందని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించిందని తెలిపారు. తద్వారా పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి బోర్లు, విద్యుత్ దీపాలు లేవని సూచించారు. స్పందించిన ఎంపీ త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆయన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్ రెడ్డి ఆయన్ను స్వాగతించి, దర్శన ఏర్పాట్లు చేశారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

పూతలపట్టు, జూలై 10: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం సుచి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. 166 మందికి ఉచిత వైద్యసేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. కోలార్‌కు చెందిన నారాయణ హృదయాలయ ఆస్పత్రి గుండె వైద్య నిపుణులు కిరణ్, నరేష్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ప్రవీణ, సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి చాతుర్మాస మహాయోగ మహోత్సవం

బంగారుపాళ్యం, జూలై 10: మండలంలోని దేవరకొండలో గురువారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు చాతుర్మాస పూజ, హోమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంచి కామకోటి పీఠాధిపతులు చంద్రశేఖర సరస్వతి, జయేంద్ర సరస్వతి, శంకర విజయేంద్ర సరస్వతి ఆశీస్సులతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి యాగాలు ప్రారంభమవుతాయని, భక్తులు పాల్గొని దైవానుగ్రహం పొందాలని కోరారు.

సామాజిక తనిఖీ సమావేశం

వెదురుకుప్పం, జూలై 10: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గత ఏడాది నుంచి చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించిందని మాంబేడు సర్పంచ్ చలంపాళ్యం కవిత, జడ్పీటీసీ సభ్యుడు చలంపాళ్యం సుకుమార్ తెలిపారు. బుధవారం మాంబేడు గ్రామ సచివాలయం వద్ద పంచాయతీ స్థాయి సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. శుక్రవారం మండల సభ జరుగుతుందని తెలిపారు.

కోదండరామాలయ హుండీ లెక్కింపు

చిత్తూరు కల్చరల్, జూలై 10: నగరంలోని కోదండ రామాలయ హుండీ లెక్కింపును ఈవో సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. రూ.1,60,281 వచ్చినట్లు ఈవో తెలిపారు.

నారా లోకేశ్‌ను కలసిన మాజీ మేయర్



చిత్తూరు సిటీ, జూలై 10: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను చిత్తూరు మాజీ మేయర్ కఠారి హేమలత బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని నారా లోకేశ్ నివాసంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. చిత్తూరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. కఠారి లావణ్య, గోపి, బాలాజి, దేగల రమేష్ ఆమె వెంట ఉన్నారు.

విద్యాసామగ్రి వితరణ



బంగారుపాళ్యం, జూలై 10: మండలంలోని 65 వెంకటాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కుప్పాల మురళి స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు వితరణ చేశారు. ఉపాధ్యాయుడు విద్యాసాగర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపీని కలసిన తెలుగు యువత నేత

వెదురుకుప్పం, జూలై 10: చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగుకు చెందిన తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి కలిశారు. బుధవారం చిత్తూరులో కలసి శుభాకాంక్షలు చెప్పారు. ఆయన వెంట టీడీపీ నేత దామోదరరెడ్డి ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట : గురజాల

చిత్తూరు, జూలై 10: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం ఉదయం ఆయన మేయర్ అముద, కమిషనర్ అరుణ, స్థానిక నాయకులతో కలిసి 48వ వార్డు పరిధిలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఇందిరానగర్‌లో ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. వీధిలో ఉన్న మట్టి దిబ్బలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. తంగవేలు కాలనీలోని పెద్ద కాలువను పరిశీలించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు కాలువలో పూడిక తీయాలని అధికారులను ఆదేశించారు. రాజీవ్‌నగర్, వన్నియర్ బ్యాంక్ వీధిలో పర్యటించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ ఎమ్మెల్యే

ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రతి గురువారమూ డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఉదయం 10నుంచి 11 గంటల మధ్య చిత్తూరు నగర పాలక కార్యాలయంలో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొని ఫోన్ ద్వారా సమస్యలను స్వీకరిస్తారు. నియోజకవర్గ ప్రజలు 9849907885కు ఫోన్ చేయవచ్చని ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది.



బల్క్‌మిల్క్ కూలర్ యూనిట్ ప్రారంభం

నగర శివారులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఉన్న శ్రీరామ్ టెక్ కంపెనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బల్క్‌మిల్క్ కూలర్ యూనిట్‌ను బుధవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం 14వ వార్డులోని ప్రశాంత్‌నగర్‌లో ఈద్గా నిర్మాణానికి సంబంధించిన భూమిపూజలో ఆయన పాల్గొన్నారు.